క్లుప్తంగా

అన్నసమారాధన

కడియం: గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపులో భాగంగా స్థానిక సినిమా రోడ్డులోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తాడాల వీర వెంకట్రావు గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. వినాయక స్వామిని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శులు గిరజాల వీర్రాజు, రావిపాటి రామచంద్రరావు, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంఆర్ పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, వేమగిరి సొసైటీ చైర్మన్ వెలుగుబంటి అచ్యుతరామ్, మండల జేసీఎస్ చైర్మన్ తాడాల చక్రవర్తి, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. అలాగే దుళ్ల మెయిన్ రోడ్డులోని గణపతి నవరాత్ర ఉత్సవ పందిళ్ల వద్ద అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఉత్సవ కమిటీలు చర్యలు చేపట్టాయి

వైద్యుల తీరుపై ఫిర్యాదు

కడియం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీరుపై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ గురువారం కలెక్టర్ కె.మాధవీలత, డీసీహెచ్ఎస్ సనత్ కుమారిలకు ఫిర్యాదు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మురమండ విచ్చేసిన వారికి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చిన్నపాటి సమస్యలకు కూడా వైద్యం అందించకుండా రాజమహేంద్రవరం పంపించి వేస్తున్నారన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని వైద్యులు హామీ ఇచ్చారు.

8న విద్యారంగ పరిరక్షణపై సదస్సు

సీటీఆర్ఐ: విశాఖపట్నంలోని సీతమ్మపేట బీవీకే కాలేజీ ఎదురుగా ఉన్న పబ్లిక్ లైబ్రరీ హాలు-2లో ఈనెల 8న విద్యారంగ పరిరక్షణపై సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, గౌరవాధ్యక్షుడు కేకే సంజీవరావు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు నిబంధనలకు తలొగ్గి పాఠశాలలను మూయవద్దని డిమాండ్ చేస్తూ సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు పర్యవేక్షణలో సదస్సు జరుగుతుందన్నారు. సంఘం వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు బి.జార్జిఆంథోనీ, మట్టపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీవాణీ వికాసం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుబ్బారావు తదితరులు

సీటీఆర్ఐ: 108 మహాసరస్వతి ఆలయాల విశేషాలు ఉన్న శ్రీవాణీ వికాసం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జ్ఞాన సరస్వతీ పీఠంలో రోటరీ క్లబ్ నగర అధ్యక్షుడు, పీఠం నిర్వాహకుడు తోట సుబ్బారావు చేతుల మీదుగా జరిగింది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు కాశిన వెంకటేశ్వరరావు దీన్ని రచించారు. సుబ్బారావు మాట్లాడుతూ దేశంలోని సరస్వతీ దేవాలయాల సమాచారాన్ని సేకరించి, పుస్తక రూపంలో వెల్లడించిన వెంకటేశ్వరరావు ధన్యుడన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు చుండ్రపట్ల ప్రకాష్ శర్మ పాల్గొన్నారు.

వృద్ధులకు పించన్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో గురువారం వృద్ధులకు పింఛన్లు, విద్యార్థినికి ఉపకార వేతనం పంపిణీ చేశారు. 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున, అలాగే సాయిపూర్వి సమన్విత జన్మదినం సందర్భంగా దుప్పట్లు అందజేశారు బీ ఫార్మసీ విద్యార్థిని ఎ.అనూషకు రూ.10 వేలు ఉపకార వేతనంగా అందించారు. వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, కొత్తపల్లి వీర్రాజు, సాయి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా నగరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. వీజీ గార్డెన్స్, కొత్త రోడ్డు, స్వతంత్ర హాస్పిటల్ రోడ్డు, కంబాలపేట, గోకవరం బస్టాండ్ సెంటర్, జాంపేట ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

● ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సావిత్రీ నగర్, హుకుంపేట, వరలక్ష్మీ కాలనీ, జనచైతన్య నగర్, కార్తికేయ నగర్, ఈనాడు, డీఎస్ఆర్ నగర్, రామకృష్ణ నగర్, ఆదర్శ్ నగర్, బాలాజీ పేట, వెంకటగిరి 2, బాపూజీ నగర్, గంగిరెడ్ల కాలనీ, హుకుంపేట ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

మోదీ విధానాలు ప్రమాదకరం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. స్థానిక హోటల్ రివర్‌బేలో సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

- కలెక్టర్ మాధవీలత
- మురమండలో వైద్యశిబిరం సందర్శన
- పాల్గొన్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



మురమండలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



పారిశుధ్య కార్మికులతో కలిసి టీ తాగుతున్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మరింత మెరుగైన వైద్యం అందుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. మురమండ సచివాలయం 2 పరిధిలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి ఆమె సందర్శించారు. శిబిరం వద్దకు విచ్చేసిన గ్రామస్తులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. నేరుగా శిబిరం వద్దకే వచ్చే వారికి కూడా టోకెన్లు జారీ చేసి ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. ఏడు రకాల వైద్య పరీక్షలను ఇంటి వద్దే నిర్వహించి, కేస్ షీట్లు రూపొందించాలన్నారు. హెల్త్ ప్రొఫైల్‌లో పూర్తి వివరాలు ఉండాలని ఆదేశించారు. కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతి శిబిరంలోనూ పీహెచ్‌సీ వైద్యులతో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. మొత్తం 14 రకాల వైద్య పరీక్షలను నిర్వహించి, ముందులు ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి, అక్కడి పదార్థాలను కలెక్టర్ రుచి చూశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌వో డాక్టర్ ఎన్.సనత్ కుమారి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ కె.విజయలక్ష్మి, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఎస్.వసుంధర, డాక్టర్ ఆనంద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మురమండ సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలి

కడియం: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్వచ్ఛత ఏక్ సంకల్పంలో భాగంగా మురమండలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. శానిటేషన్ వర్కర్లతో తేనీటి విందు స్వీకరించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం ద్వారా అనారోగ్యానికి గురి కాకుండా ఉంటామన్నారు. అనంతరం మొక్కను నాటారు. గ్రామ సర్పంచ్ అయినవిల్లి రుక్మిణీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఈవో జేవీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బాల శంకర్‌రావు, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఈవో ఎస్.అబ్రహం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ పాల్గొన్నారు.

వీఎల్‌పురం యూపీహెచ్‌సీలో..

కంబాలచెరువు: జనం ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వీఎల్.పురం యూపీహెచ్‌సీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రజలకు వైద్య సేవలు అందించారు. విద్య, వైద్యం జగనన్నకు రెండు కళ్లు అన్నారు. రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ, క్లస్టర్ ప్రెసిడెంట్ పోలు విజయలక్ష్మి, తగరం సురేష్, మార్గాని బుజ్జి పాల్గొన్నారు.

కోలమూరులో..

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు-2 సచివాలయం పరిధిలోని ఈఏఆర్ ఎయిడెడ్ స్కూల్లో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 524 మందికి వైద్యసేవలు అందించారు 23 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫరల్ చేశారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్.. సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఆఫ్తాల్మిజిస్ట్ డాక్టర్ ఎస్.కమల, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ నేతృత్వంలో డాక్టర్లు లిడియా సుచిత్ర, కె.నాగదుర్గ, జగదీష్ కృష్ణ రోగులకు వైద్యసేవలు అందించారు. పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, ఈఏఆర్ ఎయిడెడ్ స్కూల్ సంస్థల కరస్పాండెంట్ కోలమూరు ప్రభాకరరావు, కొంతమూరు సొసైటీ త్రీమెన్‌కమిటీ సభ్యుడు పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, సచివాలయ కన్వీనర్లు షేక్‌చాన్, ఆనెం శ్రీను పాల్గొన్నారు.

జిల్లాలో 7,286 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా 17 వైద్యశిబిరాలు నిర్వహించారు. పెదపర్తి, కొంకుదురు-1, చంద్రవరం, ధన్మంతునిగూడెం, గోకవరం1, మురమండ 2, శ్రీరంగపట్నం, ఆరికిరేవుల, అప్పనమునిలంక, సమిశ్రగూడెం, అన్నవరప్పాడు, కోలమూరు 2, చక్రద్వారబంధం, వెంకటాపురం, బొబ్బిల్లంక 2, ఉండ్రాజవరం 2 వీహెచ్‌సీల్లోనూ, వీఎల్‌పురం (రాజమహేంద్రవరం అర్బన్) యూపీహెచ్‌సీలో జరిగిన వైద్య శిబిరాల్లో సాయంత్రం 6 గంటలకు 7,286 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 334 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు.



వీఎల్‌పురం యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

వైఎస్ విజయమ్మకు వివాహ ఆహ్వానం



వైఎస్ విజయమ్మకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, రాజా

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహానికి రావాలంటూ వైఎస్ విజయమ్మను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఆమెకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్ చెరువు డీబీవీ రాజు లేఅవుట్‌లో అక్టోబర్ 26న జరిగే రిసెప్షన్‌కు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

అల్లూరి సంఘం గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ రామారెడ్డి



సీటీఆర్ఐ: జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ కర్రి రామారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో ఈనెల 2న సంఘం జాతీయ మహాసభ జరిగిందని, అందులో 60 మందిని నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారన్నారు. ఉపాధ్యక్షులుగా పుచ్చల రామకృష్ణ, మాదేటి రవి ప్రకాష్, కార్యదర్శులుగా చీకట్ల శివన్నారాయణ, అనిశెట్టి మధు, వెల్లాల నాగార్జున, హర దీపక్, కోశాధికారిగా బళ్లా శ్రీనివాస్, 2వ గౌరవ అధ్యక్షుడిగా దంతులూరి సుబ్బరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులుగా చింతా వీర రాఘవరెడ్డి, తేతలి పవన కుమార్ రెడ్డి, మానివెల్లి రాజబాబు, పడాల రమేష్ కుమార్ ఎన్నికయ్యారన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్

కడియం: మండలం పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గురువారం సమీక్షించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శాఖల వారీగా ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు వివరించారు. కడియం, మురమండ సెక్షన్ల పరిధిలో విద్యుత్ లైన్ మార్పునకు సంబంధించి సర్వే జరుగుతోందని ఏఈ బి.రామారావు వివరించారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. కడియంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం సమస్య ఉందని, స్థలం కేటాయింపు పూర్తయితే సబ్‌స్టేషన్ పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను మండల ఏవో ద్వారకాదేవి సమావేశానికి తెలియజేశారు. ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీపై రైతులకు ఎటువంటి పరికరాలు ఎందుకు అందడం లేదని ఎంపీపీ సత్యప్రసాద్ హెచ్‌వో సుధీర్‌ను ప్రశ్నించారు. పలువురు రైతులకు ఇప్పటికే అందించడం జరిగిందని హెచ్‌వో సమాధానమిచ్చారు. డ్వాక్రా గ్రూపులో కొనసాగకుండా వెళ్లిపోయిన ఒక సభ్యురాలు, మిగిలిన 9 మంది సభ్యులను ఇబ్బందులు పెడుతోందని, అయితే ఏపీఎం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి ప్రశ్నించారు. దీనిపై తగు చర్యలు చేపడతామని ఏపీఎం సింహాచలం తెలిపారు. సమావేశం అనంతరం ఇటీవల అవార్డు పొందిన మాధవరాయుడుపాలెం ఎంపీటీసీ గొల్లపల్లి శ్రీనివాస్‌ను సభ్యులు, అధికారులు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- బొమ్మూరులో సీసీ డ్రైనేజీలు, రోడ్లకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరులో ఏజీజీ ఎంపీ నిధులు రూ.కోటితో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొమ్మూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లినప్పుడు సమస్యలను గుర్తించామన్నారు. వాటిని పరిష్కరించడంలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రజలందరూ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం చందన నాగేశ్వర్‌ను స్థానికులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్లు మేడపాటి సద్గుణ రామారెడ్డి, ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ, మరడాపు శేఖర్, కేవీ సుబ్బారెడ్డి, మాలేటి రమేష్, తోడేటి రాజా పాల్గొన్నారు.



న్యూ ఎంప్లాయిస్ కాలనీలో సీసీ రోడ్ల శంకుస్థాపనలో పాల్గొన్న చందన నాగేశ్వర్

పాఠశాల ఎదుట విద్యార్థిని తల్లిదండ్రుల ఆందోళన



హెచ్ఎంతో మాట్లాడుతున్న జయశ్రీ, తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం రూరల్: తమ కుమార్తెను ఉపాధ్యాయుడు కొట్టడం వల్ల అనారోగ్యానికి గురైందని, తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థిని తల్లిదండ్రులు, పలువురు విద్యార్థినులు గురువారం బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. ఇనపాల జయశ్రీ ఆ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ నెల 3వ తేదీన బయాలజీ ఉపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూ ఆ బాలిక చదువులో నిర్లక్ష్యంగా ఉండడంతో వీపు మీద దెబ్బ వేశారు. దీంతో ఆ విద్యార్థిని స్పృహ తప్పి పడిపోయింది. సదరు ఉపాధ్యాయుడు వెంటనే ఆశా కార్యకర్తను పిలిచి ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి చికిత్స కోసం తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మళ్లీ ప్రైవేటు ఆసుపత్రికి సైతం తీసుకువెళ్లి రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు తీశారు. అయితే బుధవారం రాత్రి నుంచి ఉపాధ్యాయుడు నెహ్రూ అందుబాటులో లేకపోవడంతో గురువారం ఉదయం విద్యార్థిని జయశ్రీని తీసుకుని ఆమె తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి, ప్రధానోపాధ్యాయురాలికి విషయం చెప్పారు. అనంతరం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్ సంఘటన స్థలానికి వచ్చి విద్యార్థినికి అయ్యే వైద్య ఖర్చులు ఉపాధ్యాయుడు నెహ్రూ చెల్లిస్తారని హామీ ఇచ్చారు. దీంతో జయశ్రీని తల్లిదండ్రులు అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి ప్రధానోపాధ్యాయురాలితో కలిసి వెళ్లారు. అక్కడ ఆ బాలికను చేర్పించారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాన్ని వివరణ కోరగా.. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టాలని మండల విద్యా శాఖాధికారిని ఆదేశించడం జరిగిందన్నారు. విద్యార్థిని టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నట్లు చెబుతున్నారని, సదరు మెడికల్ రిపోర్టులను సైతం తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు. సదరు ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- 40వ డివిజన్‌లో గడప గడపకూ..

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. 40వ డివిజన్‌లో రమా సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్, డివిజన్ ఇన్‌చార్జి దుంగ మంగ లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పాత వెంకటేశ్వర థియేటర్ పక్క వీధుల్లో ఉడెన్ ఫర్నిచర్ కార్ఖానాల ప్రాంతంలో ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బత్తిన అన్నవరం, యలమంచిలి నాగరాజు, తగరం సురేష్, దమ్ము అప్పాజీ పాల్గొన్నారు.

పనులను పూర్తి చేయాలి

క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలకు సంబంధించి మిగిలిపోయిన పనులన్నీ సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం 7వ డివిజన్‌లో స్థానిక నాయకులతో కలిసి షాదీఖానా వద్ద నుంచి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సయ్యద్ గౌస్ మోహిద్దీన్, మైనారిటీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఆరిఫ్, మైనార్టీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ అరిపుల్లా ఖాన్, సయ్యద్, ఖాజా మోహిద్దీన్, సయ్యద్ ఐతాప్ పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

మురుగునీరు పోయేలా కాలువలో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. 40వ డివిజన్‌లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించిన సమయంలో మూలగొయ్యి వద్ద కాలువ సిల్ట్‌తో నిండిపోయి మురుగునీరు ప్రవహించకుండా ఆగిపోయిన విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎంహెచ్‌ఓ వినూత్నకు ఫోన్‌లో పరిస్థితిని తెలియచేశారు. దీంతో 24 గంటలు తిరగకుండానే శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పెట్టారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

బీసీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- ఎంపీ సుభాష్ చంద్రబోస్
- బొమ్మూరులో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్, చిత్రంలో చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: బీసీల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బొమ్మూరులోని రాఘవేంద్ర నగర్ కాలనీలో ఆ గ్రామ బీసీల ఆత్మీయ సమావేశం గురువారం సాయంత్రం రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన జరిగింది. పిల్లి సుభాష్ చంద్రబోస్, ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బోస్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో వారంలో రూరల్ నియోజకవర్గంలో నిర్వహించే బీసీల మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ బీసీలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు రీజినల్ జేసీఎస్ కన్వినర్ బీవీఆర్ చౌదరి, పీకే రావు పాల్గొన్నారు.

నర్సరీ రైతుల సంక్షేమానికి కృషి



రైతులకు పరికరాలు అందజేస్తున్న నర్సరీ రంగ ప్రముఖులు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పరిధిలోని నర్సరీ రైతుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు అన్నారు. కడియపులంక నర్సరీ అసోసియేషన్ కార్యాలయం వద్ద వివిధ రకాల పరికరాలను ఉత్పత్తి ధరలకే రైతులకు అందించేందుకు గురువారం స్టాళ్లను ప్రారంభించారు. నర్సరీ రైతులకు అవసరమయ్యే షేడ్‌నెట్‌లు, స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ సామగ్రిని లాభాపేక్ష లేకుండా ఉత్పత్తి ధరలకే అందిస్తామని ఆయన తెలిపారు. స్టాళ్లను ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, నర్సరీ రంగ ప్రముఖులు పల్ల సుబ్రహ్మణ్యం, పుల్లా ఆంజనేయులు, చంటియ్య రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కడియం ప్రాంతంలో 95 శాతం మందికి పైగా చిన్న, సన్నకారు నర్సరీ రైతులే ఉన్నారన్నారు. ఉత్పత్తి ధరలకే వివిధ రకాల పరికరాలను అసోసియేషన్ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారికి ఎంత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా పల్ల సుబ్రహ్మణ్యాన్ని ఘనంగా సత్కరించారు.

దేవీచౌక్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



శరన్నవరాత్ర ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి 90వ శరన్నవరాత్ర మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకూ జరుగుతాయని శ్రీదేవి ఉత్సవ సమితి అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు తెలిపారు. స్థానిక దేవీ కల్యాణ మండపంలో గురువారం ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ కుంకుమ పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి వేళల్లో నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 18వ తేదీ బుధవారం 108 దంపతులతో పూజలు నిర్వహిస్తామన్నారు. 15న స్వర్ణ కవచ కనక దుర్గాదేవి, 16న అన్నపూర్ణాదేవి, 17న గాయత్రీదేవి, 18న బాలా త్రిపుర సుందరి, 19న మహాలక్ష్మీదేవి, 20న సరస్వతి, 21న లలితా త్రిపుర సుందరీ దేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసుర మర్దని, 24, 25న రాజరాజేశ్వరి దేవి అలంకారంతో పూజలు నిర్వహిస్తామన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

15వ తేదీ రాత్రి 10 గంటలకు కనకదుర్గా మహత్యం, 16న సత్యహరిశ్చంద్ర నాటకం, 17న ఘంటసాల ఆర్కెస్ట్రా, 18న స్వామీ అయ్యప్ప నాటకం, 19న హైదరాబాద్ వారి సంగీత విభావరి, 20న పల్నాటి యుద్ధం, 21న సత్యహరిశ్చంద్ర, 22న బాల నాగమ్మ, 23న శ్రీకృష్ణ తులాభారం, 24న రామాంజనేయ యుద్ధం, 25న కురుక్షేత్రం నాటకం ప్రదర్శిస్తామని రాజరాజేశ్వరరావు తెలిపారు. నవంబర్ 5వ తేదీన అన్నసమారాధన ఉటుందన్నారు. సమావేశంలో శ్రీదేవి ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ముత్యాల కుమారరెడ్డి, గంధం భైరవస్వామి, ఆకుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి పడాల సూర్య కోటేశ్వరరావు, కోశాధికారి బత్తుల ఈశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఆశపు దుర్గా మల్లికార్జునరావు (మల్లిబాబు) తదితరులు పాల్గొన్నారు.